క్లుప్తంగా

రేపు బండలాగుడు పోటీలు

లింగాల: మండల కేంద్రంలో కొనసాగుతున్న కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 21న అంతర్రాష్ట్ర వృషభరాజుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.45 వేలు, రెండో బహుమతి రూ.35 వేలు, మూడో బహుమతి రూ. 25 వేలు, నాల్గో బహుమతి రూ.15 వేలు, 5వ బహుమతి రూ. 10 వేలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 22న సేద్యపు ఎద్దుల బండలాగుడు, 23న ట్రాక్టర్ రివర్స్ పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9948573454 ను సంప్రదించాలని ఆయన కోరారు.

అవార్డుల ప్రదానం ..

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశం హాల్‌లో ఈనెల 21న ఉదయం 10 గంటలకు సీసీఎం సీనియర్ నాయకుడు కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కార అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తునట్లు సాహిత్య సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వనపట్ల సుబ్బయ్య పి.వహీద్‌ఖాన్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కథల విభాగంలో 2023 సంవత్సరం అవార్డుకు గాను హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్కి కథల సంపుటికి అవార్డుకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు కే ఆనందచారి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్, సీపీఐ రాష్ట్ర నాయకుడు హెచ్ ఆనంద్ జి హాజరవుతారని తెలిపారు.

అర్హత పరీక్ష ..

లింగాల: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 21న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగాలలోని గురుకుల పాఠశాల, కళాశాల పరీక్షా కేంద్రంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 440 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కొనసాగుతుందని వివరించారు.

నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

వెల్దండ: కల్వకుర్తి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 20న రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విస్తృతస్థాయి సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు మధుసూధన్‌రెడ్డి, భాస్కర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, ఎంపీటీసీలు వెంకటయ్యయాదవ్, రాములు, యాదగిరి, శేఖర్, నాయకులు తదితరులు ఉన్నారు.

దళితులు అధికసంఖ్యలో హాజరుకావాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో శనివారం దళిత పొలిటికల్ జేఏసీ పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని దళిత పొలిటికల్ జేఏసీ చైర్మన్ వంగు విజయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి దళిత పొలిటికల్ జేఏసీ ముఖ్య నాయకులు, వివిధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో దళిత పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలన్న అంశంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్టు దుకాణాలను తొలగించాలని వినతి



కోడేరు: మండలంలో బెల్టు దుకాణాలు తొలగించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి శివ శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా సారా, మద్యం విక్రయిస్తున్నారని వివరించారు. దీంతో యువత మద్యానికి బానిస అయ్యి అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వరప్రసాద్, శ్రీశైలం, రాము, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా మగ్దూం

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఎండీ మగ్దూంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్టర్ ఫార్మసిస్ట్‌ల సంక్షేమానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

లింగాల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల, సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో పలు అంశాలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. తాగునీరు, విద్యుత్ సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాలలో మిషన్ బగీరథ పథకం ద్వారా నీటి సరఫరా సక్రమంగా కావడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి హాజరుకాని ఆయా శాఖల అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగమ్మ, వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



లింగాల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

కాంగ్రెస్ విజయం ఖాయం

అమ్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని తెలుగుపల్లికి వచ్చిన ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపీటీసీ వెంకటయ్య ఆధ్వర్యంలో 30 మంది కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, డాక్టర్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ నాసరయ్య, మనోహర్ తదితరులు ఉన్నారు.

బహుమతులు అందజేత

ఉప్పునుంతల: మండల కేంద్రంలో స్థానిక కేదారేశ్వర చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిర్వహించిన సీనియర్ విభాగం అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. సీనియర్ విభాగంలో ఆయా ప్రాంతాల నుంచి ఐదు జతల ఎద్దులు పాల్గొన్నాయి. వాటిలో ప్రాధాన్యత క్రమంలో ఐదు జతలను విజేతలుగా ఎంపిక చేసి వారికి నగదు బహుమతులు అందజేశారు. వాటిలో మొదటి బహుమతి రూ. 60 వేలు నగదును తాడూరు మండలం యాదిరెడ్డిపల్లికి చెందిన టీసీఆర్ బుల్స్ గెలుచుకున్నాయి. రెండో బహుమతి ఉప్పరి సుందరప్ప ఎద్దుల జత, మూడో బహుమతి వడ్డెమాన్ సుధాకర్‌రెడ్డి ఎద్దుల జత గెలుచుకున్నాయి. జూనియర్ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎద్దుల జతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్త పెద్ద జంగిరెడ్డి, జెడ్పీటీసీ అనంత ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ అరుణ నర్సింహ్మారెడ్డి, కట్ట అనంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, మద్దు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, షణ్ముకారెడ్డి, బూసిరెడ్డి, నర్సయ్య, రామచంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ ఇబ్రహీం, తదితరులు

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి పట్టణంలో ఓటు హక్కుపై శుక్రవారం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా, యువజన సంఘాలకు, నూతన ఓటర్లకు ఓటు హక్కుపై చైతన్యం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగాన్ని తహసీల్దార్ ఇబ్రహీం వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కవిత, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల దాతకు సన్మానం



మన్ననూర్: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఉత్సవ విగ్రహాలను అందజేసిన దాత సంబు వెంకటరమణను ఆలయ కమిటీ అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని అంబేద్కర్ కాలనీలోని ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మంతటి రఘునాథం, ప్రచార కమిటీ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వర్లు శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. అదేవిధంగా ప్రతి ఏట స్వామి వార్ల కల్యాణానికి అవసరమైన పట్టు వస్త్రాలను సమర్పించిన జూలూరు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ



కల్వకుర్తిరూరల్: మండలంలోని ముకురాల గ్రామాన్ని ఎంపీడీఓ వెంకటరాములు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలకు వెళ్లి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

మూతబడిన కామన్ సర్వీస్ సెంటర్



కోడేరు: సింగిల్‌విండో అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌కు ఆపరేటర్‌ను నియమించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. దాదాపు నాలుగు నెలల కిందట ప్రారంభించిన సెంటర్‌కు ఆపరేటర్‌ను నియమించకపోవడంతో మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 రకాల డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్న ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: ఉపాధి కూలీలు తమ ప్రాణాలు పణంగా పెట్టి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనులు చేస్తున్నా వారికి సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన సంగినేనిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు ఇవ్వాల్సిన వేసవి అలవెన్స్‌ను ఇవ్వక పోగా గంపలు, పార, గడ్డపారలకు అవసరమైన డబ్బులు, రవాణా చార్జీలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి కూలీల గ్రూపులకు మేటీలను ఏర్పాటు చేసి కమీషన్‌లు తీస్తుండడంతో కూలీలు నష్టపోవాల్సి వస్తుందని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రోజు కూలీలకు రూ.600 చెల్లించాల్సి ఉండగా అందులో సగం డబ్బులు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించకుంటే తమ సంఘం నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జంగవీరయ్య, వెంకటయ్య పలువురు మహిళా కూలీలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం కరువు



పదర మండలంలో వాలీబాల్ ఆడుతున్న ఇతర జిల్లాల క్రీడాకారులు(ఫైల్)

మన్ననూర్: నల్లమలలోని అప్పర్‌ప్లాట్ అంటేనే క్రీడలకు పెట్టింది పేరు. గ్రామీణ స్థాయి మొదలుకొని రాష్ట్ర స్థాయి వరకు ఎక్కడ ఏ రకమైన క్రీడా పోటీలు నిర్వహించిన అప్పర్‌ప్లాట్ (అడవి సింహాలు) ప్రతిభ కనబర్చేవారు. కాని ప్రస్తుతం ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో నల్లమలలో క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో విలువిద్యలో ఎంతో నైపుణ్యం కలిగిన ఆదివాసీ క్రీడాకారులు ఎందరో ఉన్నారు. అదేవిధంగా క్రికెట్‌లో జాతీయస్థాయిలో రాణించిన ఆటగాళ్లు ఉన్నారు. పలు టోర్నమెంట్‌లో వివిధ జిల్లాలక చెందిన క్రీడాకారులను అరువుగా తీసుకొచ్చి ఆడిస్తున్నారని స్థానికులు వాపోయారు. జిల్లా, డివిజన్ స్థాయి టోర్నమెంట్ లలో ఒక్కో క్రీడాకారుడు వరుసగా రెండు మూడు సార్లు సెంచరీలు చేసిన చరిత్ర ఉన్నప్పటికి క్రీడాకారులకు ప్రోత్సాహం లేక నిరుత్సాహానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. అధికారులు పాలకులు స్పందించి నల్లమల క్రీడాకారులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

అటవీశాఖ ఆధ్వర్యంలో గతంలో ఆర్చరీలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన కూడా అధికారులు నుంచి ప్రోత్సాహం లేదు. దీంతో ప్రతిభను చాటుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి మరింత శిక్షణ ఇప్పిస్తే జాతీయ స్థాయిలో రాణిస్తా.

– లక్ష్మయ్య, ఆర్చరీ క్రీడాకారుడు, మల్లాపూర్ చెంచు పెంట

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన పురుగుల లింగయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వేరు వేరుగా బాధితకుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు భీమయ్యగౌడ్, మధుసూధన్‌రెడ్డి, భాస్కర్‌రావు, యాదగిరి, శేఖర్, మైసయ్య, లాలయ్య, శ్రీను, కొండల్, యాదయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



కొల్లాపూర్: మండలంలోని నార్లాపూర్‌లో ఎస్సీ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఈ రాకేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. చిన్నారులు, వృద్ధులు రాత్రివేళ అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ హామీ ఇచ్చారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు

బిజినేపల్లి: మండలంలోని బిజినేపల్లి శివారులో కారు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మిడ్జిల్ మండలానికి చెందిన మహేష్ గంగారంలో నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలకు బైక్‌పై వెళ్తున్నాడు. బిజినేపల్లి శివారు ప్రాంతంలోకి రాగానే బైక్‌ను కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మహేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత



కోడేరు: అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమూర్తి వివరాల ప్రకారం మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా గోపాల్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ దేవరాజు లబ్ధిదారుల నుంచి ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నాడు. పోలీసుల తనిఖీల్లో వాహనం పట్టుబడగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాలమూరుకు తరలిన కాంగ్రెస్ నేతలు

ఊర్కొండ: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాలమూరుకు తరలివెళ్లారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమీ, ఊరుకొండ జేఏసీ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పైల గోపాల్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి గోపి నాయక్, నాయకులు అయుబ్‌పాషా, మనోహర్ రెడ్డి, సైబాజ్, అంజయ్య, శ్రీశైలం, మధు ఉన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



వెల్దండలో బీజేపీలో చేరుతున్న యువకులు

వెల్దండ: బీజేపీతోనే దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యమని కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సిలోనిబావితండాలో వివిధ పార్టీలకు చెందిన యువకులు ఆ పార్టీ కార్యాలయంలో శేఖర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు జంగయ్యయాదవ్, బూత్ అధ్యక్షుడు రమేష్, హేమ్లనాయక్, మల్లేష్, శ్రీహరి, నితిన్, నాగేష్, కుమార్, ఆర్. కుమార్, శ్రీకాంత్, ఆర్. మల్లేష్, కిరణ్, శ్రీకాంత్, మల్లేష్, మహేష్, పెద్దయ్య తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

తాడూరు: నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ నాయకుడు వెంకట్‌నారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో శ్మశాన వాటికలు, డంపింగ్‌యార్డులు, రైతువేదికలు నిర్మించారన్నారు. పేదల కోసం ఉచిత ఉజ్వల యోజన పథకం, ఉచిత రేషన్ బియ్యం అమలు చేశారన్నారు. దేశ భద్రతకోసం మరోసారి బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, సత్యం, వెంకటయ్య, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకం



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

తాడూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం మండలంలోని గుంతకోడూరు పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాధ్యతగా పనిచేస్తే సమాజం గుర్తిస్తుందన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే గౌరవప్రదమైన స్థానం లభిస్తుందన్నారు. అనంతరం లక్ష్మీనారాయణను సన్మానించారు. సమావేశంలో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, జీహెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

దోమలపెంట: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం భూగర్భ కేంద్రం సేఫ్టీ, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో దోమలపెంటలోని బస్టాండ్ ప్రాంగణంలో గ్రామస్తులకు, చిరువ్యాపారులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్యాస్ సిలిండర్లు, ఎలక్ట్రికల్ ద్వారా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఏవిధంగా మంటలను ఆర్పాలో కేంద్రం సేఫ్టీ అధికారి డీఈ శ్రీకుమార్‌గౌడ్, ఎస్ఎఫ్ఓ మల్లికార్జున వివరించారు. అప్రమత్తతో ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ ఆదినారయణ, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు వి.కిషన్, సేఫ్టీ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న కృష్ణుడు

తాడూరు: ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గుంతకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరేళ్లుగా బదిలీలు, ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 2010 డీఎస్సీ కన్న ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బీసీటీఏ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, భాస్కర్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, తిరుపతయ్య పాల్గొన్నారు.

రోడ్డు మధ్యన ఉన్న స్తంభాలు తొలగించండి



పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్ల మధ్యన విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. దేవల్‌తిరుమలాపూర్, దేవినేనిపల్లి, పెద్దకార్పాముల, కల్వకోల్ గ్రామాల్లో సీసీ రోడ్ల మధ్యమే స్తంభాలు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకొని రోడ్ల మధ్యన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

కవర్ కట్టిన మామిడికి డిమాండ్



పెద్దకొత్తపల్లి: మామిడి తోటలో కాయలకు పాలిథిన్ కవర్‌లు కట్టడం వలన ఎలాంటి చీడపీడలు లేకుండా మామిడి కాయలు పుష్టిగా పెరగడంతో ధర రికార్డు స్థాయిలో పలుకుతోంది. క్వింటాలుకు రూ.1.10 లక్షల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా పండించే మామిడి కాయలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. కవర్‌లు కట్టినవాటికి ధర ఎక్కువగా ఉండడంతో రైతులు కవర్‌లు కట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మండల కేంద్రంలో రైతు ఎల్లస్వామి మామిడి తోటలకు కవర్లు కట్టడంతో రికార్డు స్థాయిలో ధర లభించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

ఆర్ఎస్పీ సభకు గాయంతో మాజీ ఎమ్మెల్యే హాజరు

కొల్లాపూర్: హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నివాసంలో గురువారం మెట్లు ఎక్కుతుండగా కాలు బెణికి స్వల్ప గాయమైంది. శుక్రవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ ప్రచార కార్యక్రమానికి ఆయన కొల్లాపూర్‌కు వచ్చారు. వాకింగ్ స్టిక్ సహాయంతో కొద్దిసేపు ప్రచారంలో పాల్గొన్నారు. రోడ్‌షోలో అభివాదం చేశారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని కార్యకర్తలు అడిగి తెలుసుకున్నారు.

నీటి వృథాను అరికట్టండి

పాన్‌గల్: ఎండల తీవ్రతతో బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఇబ్బందులు ఏర్పడుతున్న తరుణంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు చెబుతున్నా.. కొన్ని గ్రామాల్లో నీటి వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పలు కాలనీల్లో నల్లాలకు ఆన్‌ఆఫ్ లేక నీరు వృథా అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నల్లాలకు ఆన్‌ఆఫ్ ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

22న ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి బుగ్గవెంకటేశ్వర స్వామి నూతన దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 22న నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.